సాక్షి
కర్నూలు
మంగళవారం । 7 । మార్చి । 2023



వైభవంగా గిరిప్రదక్షిణ
శ్రీశైలంటెంపుల్: ఫాల్గుణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.



నయనానందకరం..
బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఎగువ అహోబిలంలో జ్వాల నరసింహుడి రథోత్సవం కనుల పండువగా సాగింది. భక్తజనం స్వామిని దర్శించుకుని పరవశించిపోయారు. 11లో

ఉష్ణోగ్రతలు

కనిష్టం	20.1
గరిష్టం	37.2

న్యూస్‌రీల్

రేపటి నుంచి రబీ పంటల నమోదుపై సోషల్ ఆడిట్

కర్నూలు(అగ్రికల్చర్): రబీ పంట ఈ–క్రాప్ నమోదు జాబితాలను ఈ నెల 8 నుంచి రైతుభరోసా కేంద్రాల వారీగా సోషల్ ఆడిట్‌కు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 12 వరకు వీటిని రైతులు పరిశీలించి పంటల నమోదులో తప్పులు, పొరపాట్లు ఉంటే సంబంధిత అధికారులకు అభ్యంతరాలను రాతపూర్వకంగా చెప్పవచ్చు. వీటిని ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు పరిష్కరిస్తారు. ఈ నెల 20న రబీ పంటల నమోదుకు సంబంధించి తుది జాబితాను ప్రకటిస్తారు. రబీలో 75,619 మంది రైతులు 231854.3 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేశారు. ఈ పంటలను వీఏఏలు, వీఆర్‌వోలు బయోమెట్రిక్ ద్వారా నిర్ధారించారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

కర్నూలు: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని, వాహనదారులు తమ భద్రతకు పోలీసుల సూచనలు పాటించాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నది పోలీసుల లక్ష్యమన్నారు. జరిమానాల కంటే అవగాహన కల్పించడమే ముఖ్యమని భావించి పోలీసు యంత్రాంగం ప్రమాదాల నియంత్రణకు సమష్టిగా కృషి చేస్తోందన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 28వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. వివిధ ఉల్లంఘనలకు 25,976 ఈ–చలానాలు విధించి రూ.48,23,210 అపరాధ రుసుం వసూలు చేసినట్లు పేర్కొన్నారు.

శ్రీశైలభ్రామరికి లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా సోమవారం లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. మంగళకరమైన ద్రవ్యాలలో ఎంతో ప్రాధాన్యత ఉన్న కుంకుమతో అమ్మవారిని అర్చించడం విశేష ఫలదాయకమని వేద పండితులు పేర్కొన్నారు. లక్ష కుంకుమార్చన పూజలు జరిపించుకోవడంతో కష్టాలు తొలగి, శుభాలు కలిగి, అభీష్టాలు సిద్ధిస్తాయన్నారు. శ్రీశైలానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ.1,016 చెల్లించి పరోక్ష సేవలో పాల్గొనే అవకాశం దేవస్థానం కల్పించింది.

ప్రాక్టికల్ పరీక్షలకు 80 మంది గైర్హాజరు

నంద్యాల(సిటీ): ఉమ్మడి (కర్నూలు, నంద్యాల) జిల్లాలో ఇంటర్మీడియట్ రెండవ ఏడాది జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలకు 80 మంది గైర్హాజరయ్యారని ఆర్‌ఐఓ గురువయ్యశెట్టి తెలిపారు. 69 కేంద్రాలలో 4,326 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 4,246 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు స్లీపర్ బోగీ

నంద్యాల(రూరల్): నంద్యాల మీదుగా నడిచే గుంటూరు–కాచిగూడ (17251), కాచిగూడ–గుంటూరు(17252) ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు స్లీపర్ బోగీ ఏర్పాటు చేస్తున్నట్లు నంద్యాల రైల్వే స్టేషన్ మేనేజర్ షేక్ అబ్దుల్ వహాబ్ సోమవారం తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి జనరల్ బోగీ స్థానంలో స్లీపర్ బోగీ శాశ్వత ప్రాతిపదికన మార్చుతున్నారు. ఈ రైలులో ఏసీ–3టైర్–1, స్లీపర్ 11, జనరల్ 5, బ్రేక్‌వ్యాన్ 2 బోగీ ఉంటాయని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని స్టేషన్ మేనేజర్ పేర్కొన్నారు.

ఉరుకుంద ఈరన్న స్వామికి విశేష పూజలు



కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు.

మామూళ్ల కోడ్

➤ కర్నూలుకు చెందిన ఓ వ్యక్తి తన కారును మరొకరికి విక్రయించాడు. యాజమాన్య హక్కులను తన పేరుపై మార్చుకునేందుకు కొనుగోలు చేసిన వ్యక్తి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ–వాహన్‌లో వివరాలు నమోదు కాలేదని, ఇన్సూరెన్స్ సక్రమంగా లేదని, ఇలా పలు కారణాలతో తిరస్కరించారు. అన్నీ సక్రమంగా ఉన్నా ఇలా జరిగిందేమిటని తెలిసిన వారిని అడిగితే ఓ ఏజెంట్ (దళారీ) ఫోన్ నంబర్ ఇవ్వగా అక్కడికి వెళ్లి వివరాలు చెప్పాడు. గతంలో పెట్టిన పత్రాలతోనే మళ్లీ దరఖాస్తు చేసి రూ.2,700 ఇచ్చాడు. మరుసటి రోజే ఆమోదం పొందడంతో దరఖాస్తుదారుడు అవాక్కయ్యాడు.

➤ కర్నూలు నగరం నరసింహారెడ్డి నగర్‌కు చెందిన మరో వ్యక్తి ద్విచక్ర వాహనం, కారు నడిపేందుకు లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. అతను 10వ తరగతి వరకు చదువుకున్నాడు. దరఖాస్తు చేసుకునేందుకు నంద్యాల రోడ్డులోని పాత ఆర్‌టీఏ కార్యాలయం వద్ద ఉన్న సర్వీస్ సెంటర్‌కు వెళ్లాడు. అక్కడున్న వ్యక్తి పరీక్ష కష్టంగా ఉంటుందని.. వాహనం నడిపే సమయంలో ఏదైనా ఇబ్బంది వచ్చినా, సక్రమంగా వాహనం నడపకపోయినా అధికారులు ఒప్పుకోరని భయపెట్టాడు. దీంతో ఏమి చేయాలి ప్రశ్నించగా.. రూ.3 వేలు ఇస్తే మొత్తం తానే చూసుకుంటానన్నాడు. గత్యంతరం లేక అడిగినంతా ఇచ్చి చేతులు దులుపుకున్నాడు.



డీటీసీ కార్యాలయం

రవాణా శాఖ నయా దందా

- ఆన్‌లైన్ చేసినా ముడుపు ముట్టనిదే కదలని ఫైళ్లు
- లైసెన్స్ మొదలు అన్నింటికీ ఆమ్యామ్యాలే..
- కొత్త పుంతలు తొక్కుతున్న దళారీ వ్యవస్థ
- ఫైళ్ల చివర ఏజెంట్ల పేరు తెలిసేలా కోడ్
- ప్రాసెసింగ్ చార్జీల పేరిట డీలర్ల నిలువుదోపిడీ

కర్నూలు: రవాణా శాఖలో అడుగడుగునా అక్రమాలే. అధికారుల ఆమ్యామ్యాలకు, దళారుల విచ్చలవిడి దందాకు అడ్డుకట్ట వేసేందుకు ఉన్నత స్థాయిలో ఎలాంటి మార్పులు తీసుకొస్తున్నా.. అందుకు తగిన మార్పులతో వసూళ్ల పర్వం కొనసాగుతోంది. లర్నింగ్ లైసెన్స్, వాహన సామర్థ్యం.. ఇలా ప్రతి దశలో డబ్బు ముట్టనిదే పని జరగని పరిస్థితి. ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసినా ఏదో ఒక అడ్డుపుల్ల వేయడం, దళారీ ప్రమేయంతో వెళ్తే వాహనం నడపడం రాకపోయినా లైసెన్స్ చేతిలోకి వచ్చి పడుతోంది. ఉమ్మడి జిల్లాలో కర్నూలు ఉప రవాణా కార్యాలయంతో పాటు నంద్యాలలో ప్రాంతీయ కార్యాలయం, ఆదోనిలో యూనిట్ కార్యాలయం, డోన్, ఆత్మకూరులో ఎంవీఐ కార్యాలయాలు ఉన్నాయి.

అధికారులు చెప్పే మాటలు ఇవీ..

రవాణా కార్యాలయాలకు దళారులు రాకూడదు. నేరుగా కార్యాలయానికి వచ్చి పనులు చేయించుకునే విధానం తీసుకొచ్చాం. మా ఉద్యోగులే సహాయకులుగా అన్ని పనులు చేసి పెడతారు. సీసీ కెమెరాల నిఘాలో కార్యాలయం ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని రుసుములు చెల్లించి స్లాట్ బుక్ చేసుకుని పనులు పూర్తి చేసుకోవచ్చు.

దళారుల రాజ్యం ఇలా..

ఏదో ఒక రూపంలో దళారీలు కార్యాలయంలోనికి చొరబడుతున్నారు. వసూళ్ల పర్వం ఎవరికీ అనుమానం రాకుండా సజావుగా సాగుతోంది. అన్నీ సవ్యంగా ఉన్నా ఫైల్‌ను వెనక్కు పంపడం, ఆ తర్వాత దళారులు పని చక్కబెట్టడం మూడో కంటికి తెలియకుండా జరిగిపోతుంది. ఇదేమంటే అధికారులు తమకు ఏ పాపం తెలియదంటారు.

అప్పుడు మామూళ్లు.. ఇప్పుడు ప్రాసెసింగ్ చార్జీలు

కొత్త వాహనాలు కొనుగోలు చేశాక ఏజెంట్ వద్దకు వెళ్లి ఆయన అడిగిన మొత్తం ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు. అందులోనే రిజిస్ట్రేషన్ రుసుములు, అధికారుల మామూళ్లు, ఏజెంట్ వాటా ఉండేవి. చలానా ఫీజు ఎంతో, మామూళ్ల మొత్తం ఎంతో తెలిసేది కాదు. ఈ విధానాన్ని ప్రక్షాళన చేసేందుకు వాహన డీలరు దగ్గరే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయించుకునే విధానం తీసుకొచ్చారు. కానీ డీలర్లు గతం కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారని కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు. ద్విచక్ర వాహనం రిజిస్ట్రేషన్‌కు నిబంధనల ప్రకారం చెల్లించేది రూ.935 మాత్రమే. డీలరు మాత్రం రూ.2 వేలు అదనంగా వసూలు చేస్తున్నారు. అలాగే కారుకు కూడా రూ.3 వేలు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇంత తీసుకున్నారేంటని ప్రశ్నిస్తే ప్రాసెసింగ్ చార్జీలు అంటారు. ఇవన్నీ మాకే కాదు.. అధికారులకు ఇవ్వాలని చెబుతుండటం గమనార్హం.

ఏజెంట్ల వారీగా కోడ్‌లు

ఏజెంట్ ద్వారా వెళ్లే ఫైల్‌కు చివరన 'కోడ్' వేస్తారు. అది ఏజెంట్ పేరును తెలియజేస్తుంది. ఏజెంట్ల ద్వారా రోజూ లేదా వారంలో ఎన్ని ఫైళ్లు (దరఖాస్తులు) కార్యాలయానికి వచ్చాయో కోడ్ ద్వారా తెలుస్తుంది. ఆ ఏజెంట్ దగ్గరికి అధికారికి చెందిన ప్రైవేటు వ్యక్తి వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నారు. లైసెన్స్‌లు కావాలంటే మీ సేవలో చలానాలు తీయాలి. కొందరు ఏజెంట్లకే మీసేవ కేంద్రాలు ఉండటం గమనార్హం. ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్)లకు ఆధార్ ఇచ్చి ఓటీపీ జనరేట్ చేశాక రూ.3,200 అదనంగా తీసుకుంటున్నారు. పరీక్ష కోసం ఇచ్చిన తేదీలో హాజరై సంప్రదించిన ఏజెంట్ పేరు లోపల చెబితే చాలు అభ్యర్థి ఉత్తీర్ణతకు కావలసిన సమాధానాలు వాళ్లే చెప్పి పాస్ చేస్తున్నారు. డ్రైవింగ్ పరీక్ష ప్రతిభ ఎలా ఉన్నా ఆమోదముద్ర వేస్తున్నారు.

కథ నడిపించేదంతా వారే...

వాహన సేవల నిమిత్తం కర్నూలు డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి నిత్యం 300 నుంచి 500 మంది వరకు వస్తుంటారు. మధ్యవర్తుల(ఏజెంట్లు) ప్రమేయం లేదంటూ కార్యాలయం గోడకు పోస్టర్లు దర్శనమిచ్చినా ఇదంతా బయటివారి నోరు మూయించడానికే. లోపలికి వెళ్లి ఏజెంట్ పేరు చెబితే కానీ పని జరగడం లేదు. లైసెన్స్‌ల జారీ, వాహనాల సామర్థ్యం (ఫిట్‌నెస్) ధృవీకరణ పత్రాలు, చిరునామా మార్పు, అనుమతులు, పేరు మార్పిడి, నవీకరణ, పట్టుబడిన వాహనాలు తదితర సేవలన్నీ ఆన్‌లైన్ చేశారు. నంద్యాల రోడ్డులోని పాత ఆర్టీవో కార్యాలయం వద్ద సుమారు 50 దాకా మధ్యవర్తుల(ఏజెంట్లు) దుకాణాలు ఉన్నాయి. వీరే కథంతా నడిపిస్తారు. వీరిని కలిస్తే కచ్చితంగా పని అవుతుంది. లేదంటే అధికారులు ఏవో కొర్రీలు పెట్టి ఫైళ్లను వెనక్కు పంపుతారు.

దళారుల దందాకు ఆస్కారమే లేదు



అంతా ఆన్‌లైన్ చేశాం. పరివాహన్ యాప్ అందుబాటులోకి వచ్చింది. దళారుల దందాకు ఆస్కారం లేదు. ప్రభుత్వ ఫీజు కన్నా అధికంగా నగదు డిమాండ్ చేస్తే ప్రజలు ప్రశ్నించాలి. ప్రైవేటు వ్యక్తులు, ఏజెంట్లను ఆశ్రయించవద్దు. నేరుగా కార్యాలయానికి వచ్చి పనులు చక్కబెట్టుకోవాలి. కార్యాలయంలో సేవల కోసం డబ్బులు అడిగితే ఉన్నతాధికారికి ఫిర్యాదు చేయవచ్చు.

– రమేష్, ఆర్‌టీఓ

అమ్మ కోసం..

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి.. గైడ్‌గా మారి
- తల్లిని తీర్థయాత్రలు తిప్పుతున్న కుమారుడు



తల్లి చూడరత్నమ్మను తీసుకుని మంత్రాలయం వచ్చిన కృష్ణకుమార్

మంత్రాలయం రూరల్: కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దక్షిణామూర్తి కృష్ణకుమార్ తన తల్లి కోసం రూ.లక్షకు పైగా జీతం వస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేశాడు. తల్లి కలలను నెరవేర్చేందుకు గైడ్‌గా మారి తీర్థయాత్రలు తిప్పుతున్నాడు. మైసూరుకు చెందిన చూడరత్నమ్మకు చిన్నప్పటి నుంచి పుణ్య క్షేత్రాలను చూడాలనే ఆశ ఉండేది. భర్త దక్షిణామూర్తి మృతితో ఇక తన కల నెరవేరదేమోనని వేదనకు గురైంది. ఈక్రమంలో కుమారుడు దక్షిణామూర్తి కృష్ణకుమార్ తన తల్లి కల నెరవేర్చేందుకు ఉద్యోగాన్ని వదిలేశాడు. వివాహం సైతం చేసుకోకుండా స్కూటర్‌పై తల్లిని తీసుకుని 2018లో తీర్థయాత్రలకు బయలుదేరాడు. 2020లో కోవిడ్ కారణంగా వారి యాత్రలకు బ్రేక్ పడింది. ఆర్నెల్ల నుంచి మళ్లీ యాత్రను మొదలుపెట్టి సోమవారం మంత్రాలయం చేరుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణకుమార్ మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లి రుణం తీర్చుకునేందుకు తీర్థయాత్రలు చేపట్టామన్నారు. ఇప్పటికి దాదాపు 64,873 కిలోమీటర్లు పూర్తి చేసుకున్నామన్నారు. కర్ణాటక, తమిళనాడు, ఏపీ, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, కోల్‌కత్తా, అరుణాచల్‌ప్రదేశ్‌తో పాటు నేపాల్, భూటాన్, మయన్మార్ దేశాలు సందర్శించామన్నారు. భగవంతుడు తమకు అవకాశం ఇచ్చినంత కాలం యాత్ర కొనసాగిస్తామన్నారు. కాగా మంత్రాలయం చేరుకున్న తల్లీ కుమారులను సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు వేణుగోపాల్‌రాజు, వెంకటేశ్వర్లు అభినందించారు.

కర్నూలుకు మెగా పవర్ ప్రాజెక్టు

- హైదరాబాద్–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌తో వేల మందికి ఉద్యోగాలు
- సీఎం వైఎస్ జగన్‌పై భరోసాతోనే రాష్ట్రంలో రూ.లక్షల కోట్ల పెట్టుబడులు
- గతంలో పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనలు చేసి మోసం చేసిన చంద్రబాబు
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని, రామయ్య



కాటసానికి కేక్ తినిపిస్తున్న బీవై రామయ్య, చిత్రంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు

కర్నూలు(రాజ్‌విహార్): విశాఖపట్నంలో జరిగిన పారిశ్రామికవేత్తల సమ్మిట్ గ్రాండ్ సక్సెస్ అయిందని, కర్నూలుకు మెగా పవర్ ప్రాజెక్టు రానుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య తెలిపారు. కర్నూలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ మంజూరుతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చడమే తమ ప్రభుత్వానికి లక్ష్యమని పేర్కొన్నారు. ఏపీని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దడం కేవలం సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమతుందన్నారు. విశాఖపట్నంలో జరిగిన సమ్మిట్‌లో 25 దేశాలకు చెందిన 30కి పైగా ప్రముఖ కార్పొరేట్ సంస్థల నుంచి 46 మంది రాయబారులు హాజరయ్యారని చెప్పారు. ఇందులో 378 ఒప్పందాలు చేసుకున్నారని, రూ.13.41లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అంగీకారానికి వచ్చారన్నారు. ఈ ఒప్పందాలను వాస్తవ రూపంలోకి తెచ్చేందుకు సీఎస్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు ఓ బ్యాచ్‌ను సిద్ధం చేసుకొని ప్రత్యేక విమానాల్లో విదేశీ పర్యటనలు చేసేవారని, విహార యాత్ర చేసి వచ్చి, అక్కడి తరహాలో ఇక్కడ రాజధాని నిర్మిస్తామని చెప్పి, గ్రాఫిక్స్‌లో చూపించారు తప్ప ఆచరణలో పెట్టలేదన్నారు. తాత్కాలిక రాజధానికే రూ.వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత బాబుకే దక్కిందన్నారు. ఓట్లేసిన రాష్ట్ర ప్రజలనే మోసం చేయడంతో ఎన్ని దేశాల చుట్టూ తిరిగినా పారిశ్రామికవేత్తలు చంద్రబాబును నమ్మలేదని, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాలేదన్నారు. 2014–19 మధ్య చేసుకున్న ఒప్పందాలన్నీ బోగస్‌వే అని అన్నారు. తమ ప్రభుత్వ పాలనలో ప్రజలు, యువత సంతృప్తిగా ఉన్నారని, మండలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు బంపర్ మెజారిటీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 1,178 మంది ఓటర్లు ఉండగా తమ పార్టీకి చెంది వారే 1,030 మంది ఉన్నారని, గెలుపు నల్లేరుపై నడకేనన్నారు. పార్టీ గుర్తుతో పోటీ చేసే ధైర్యం లేక టీడీపీ సర్పంచ్‌లను ఇండిపెండెంట్లుగా బరిలో దించిందన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ సీఎం జగన్ విజన్ ఉన్న నాయకుడున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ ఉద్యోగాలు భర్తీ చేసి, లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా రావడంతో కేక్ కట్‌చేసి పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి, కర్నూలు నియోజకవర్గ పరిశీలకులు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు సీహెచ్ మద్దయ్య, అక్కిమి హనుమంత రెడ్డి, యూనుస్, గోపాల్‌రెడ్డి, ధనుంజయ ఆచారి, లక్ష్మీకాంతయ్య, కార్పొరేటర్లు రాజేశ్వరరెడ్డి, పద్మలతారెడ్డి, ఆయేషా, శ్వేతారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో కర్నూలుకు రెండోస్థానం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీలో మార్చి నెలకు సంబంధించి నంద్యాల, కర్నూలు జిల్లాలు రాష్ట్రంలోనే మొదటి, రెండు స్థానాల్లో నిలిచాయి. ఈ నెల 5వ తేదీతో పింఛన్ల పంపిణీ పూర్తయింది. నంద్యాల జిల్లాలో 2,16,982 పింఛన్లు ఉండగా 2,15,554 పింఛన్లు.. కర్నూలు జిల్లాలో 2,39,282 పింఛన్లు ఉండగా.. 2,37,676 పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేసే విషయంలో నంద్యాల జిల్లా 99.34శాతం పంపిణీతో రాష్ట్రంలోనే మొదటి స్థానం .. కర్నూలు జిల్లా 99.33 శాతంతో రెండో స్థానం దక్కించుకున్నాయి. ఇందుకు కారణమైన వార్డు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లను డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య అభినందించారు. మిగిలిన నగదును వెంటనే ప్రభుత్వానికి జమ చేయాలని ఆయన ఆదేశించారు.

పోలింగ్‌లో పొరపాట్లకు తావివ్వొద్దు

- ఎన్నికల అధికారుల శిక్షణ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రామ్‌సుందర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): పొరపాట్లకు తావివ్వకుండా మార్చి 13వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఉద్యాన భవన్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పీఓలు, ఏపీఓలకు పోలింగ్ విధానంపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పీఓలు, ఏపీఓల పాత్ర అత్యంత కీలకమన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు వీడియో కవరేజ్ చేయాలన్నారు. ఏజెంట్లను ఫారం–10తో వచ్చేలా చూడాలని, వారు పోలింగ్ బూత్ బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌లు, పెన్నులను అనుమతించరాదన్నారు. ఈ కార్యక్రమానికి ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, మాస్టర్‌ట్రైనర్, రిటైర్డ్ డిప్యూటీ ఎస్‌ఓ వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లాలోని రెవెన్యూ డివిజినల్ అధికారులు హాజరయ్యారు.



ఎన్నికల విధులపై అవగాహన కల్పిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

గైర్హాజరైన వారికి రేపు శిక్షణ

గ్రాడ్యుయేట్, టీచర్, ఎమ్మెల్సీ ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన పీఓలు, ఏపీఓలకు బుధవారం ఉదయం జెడ్పీలోని మినీ మీటింగ్ హాలులో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం గ్రాడ్యుయేట్, టీచర్ ఎన్నికల పీఓలు, ఏపీఓలకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 266 మంది హాజరు కావాల్సి ఉండగా 238 మంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన 28 మంది గైర్హాజరవ్వడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు

మార్చి 10వ తేదీలోపు ఉమ్మడి జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. ఆర్‌డీఓ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో కుర్చీలు, బల్లలు, మంచినీరు, నిరంతర విద్యుత్‌తోపాటు ఇతర వసతులను కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ప్రాధాన్యత ఓటునే వేయాల్సి ఉంటుందని, ఈ నెల 8వ తేదీన ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 1,178 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో 187 మంది నిరక్షరాస్యులని, వీరు ఓటు వేయడానికి సహాయకులను నియమించుకోవచ్చన్నారు. సహాయకులు 10వ తేదీ లోపు అధికారికంగా రిటర్నింగ్ అధికారితో ధ్రువీకరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు



ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి

- కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): రూఫ్ లెవల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి రోజూ స్పందనను నిర్వహించాలన్నారు. సచివాలయ ఉద్యోగుల హాజరుపై ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు దృష్టి సారించాలన్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను ఆరోగ్య కార్యకర్తల ద్వారా అందించాలని సూచించారు. హౌసింగ్‌కు సంబంధించి రూఫ్ కాంక్రీట్ లెవెల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. హౌసింగ్‌లో ప్రతీరోజూ పురోగతి వచ్చేలా చూడాలన్నారు. స్పందనకు సంబంధించిన 1902 కాల్ సెంటర్, ఇతర మాధ్యమాల ద్వారా వచ్చిన అర్జీలు రీఓపెన్ కాకుండా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి,సీపీఓ అప్పలకొండ, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, డీపీఓ నాగరాజునాయుడు, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఇలా వేయాలి

- అవగాహన లేకుండా ఓటు వేస్తే చెల్లుబాటు కాని పరిస్థితి
- సాధారణ ఎన్నికలతో పోల్చుకుంటే భిన్నంగా మండలి ఎన్నికల ఓటింగ్
- ప్రాధాన్యత ఓటు వేస్తేనే మంచిది

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 13వ తేదీన పోలింగ్ జరగనుంది. పట్టభద్రుల స్థానం నుంచి 49 మంది, ఉపాధ్యాయ స్థానం నుంచి 12 మంది బరిలో ఉన్నారు. శాసన మండలి ఎన్నికల్లో ఓటింగ్ సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఉంటుంది. ఇక్కడ పోటీలో ఉన్న వారందరికీ ప్రాధాన్యత ఓటును వేయవచ్చు. శాసనసభ ఎన్నికల మాదిరిగా పార్టీల గుర్తులు, ఎలక్ట్రానిక్ మెషీన్లు ఉండవు. ఇక్కడ బ్యాలెట్ పేపర్ మాత్రమే ఉంటుంది. అందులో అభ్యర్థి పేరు, ఫొటో ఉంటాయి. వాటికి ఎదురుగా ఉన్న గడుల్లో ప్రాధాన్యత ఓటు వేసుకోవచ్చు. నచ్చితే ఒక్కరికే ఓటు వేయవచ్చు. లేదంటే అందరికీ ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయవచ్చు.



ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

- ఈ ఎన్నికల్లో సిరా ఉండదు. ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయడం కోసం బ్యాలెట్ పేపర్‌తోపాటు ఎన్నికల కమిషనే స్కెచ్ బాల్ పెన్నును ఇస్తుంది. దానిని వాడాలి. మన దగ్గర ఉన్న పెన్నుకాని, పెన్సిల్‌నుగాని ఎట్టి పరిస్థితుల్లో వినియోగించరాదు.
- అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉన్న గడిలో మాత్రమే నంబర్ వేయాలి.
- ప్రాధాన్యత క్రమంలో అందరి కంటే ఎక్కువగా ఇష్టపాత్రుడైన వారిపేరు ఎదురుగా ఉన్న గడిలో 1 అనే అంకెను వేయాలి. తరువాత ఇష్టమైన వారు బరిలో ఉంటే ప్రాధాన్యతను బట్టి 2, 3, 4 నంబర్లను వేసుకుంటూపోవాలి.
- ఒకటో ప్రాధాన్యత ఇవ్వకుండా 2, 3, 4 ఇస్తే ఓటు చెల్లదు.
- ఒక్కరికే ఓటు వేయాలంటే వేసుకోవచ్చు.
- అవసరం అనుకుంటే ఎందరికైనా ఓటు వేయవచ్చు.
- ఒకే అంకెను ఇద్దరికి ఇస్తే ఓటు చెల్లుబాటు కాదు.
- 1, 2, 3, 4.. అంకెలే ప్రాధాన్యతకు ఇస్తే చెల్లుబాటు అవుతాయి.
- రోమన్ అంకెలను ప్రాధాన్యత క్రమంలో వేసినా ఓటు చెల్లుబాటు అవుతుంది.
- టిక్‌మార్కు, ఇన్‌టు మార్కు పెట్టిన ఓటు చెల్లదు.
- గడి మధ్యలోనే నంబర్ వేయాలి. ఇద్దరు అభ్యర్థుల మధ్య నంబర్ వేస్తే చెల్లుబాటు కాదు.

ప్రాధాన్యత ఓటు వేస్తేనే మంచిది...

శాసనమండలి ఎన్నికల్లో ప్రాధాన్యత ఓటుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. అయితే ప్రస్తుతం బరిలో ఉన్న అభ్యర్థులు కేవలం ఒకే ఓటును ఓటర్లను కోరుతున్నారు. దీంతో పోలైన ఓట్లలో సగం కంటే ఒకటి ఎక్కువ రాకపోతే ఓట్ల లెక్కింపులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. పైగా ప్రాధాన్యత ఓటు వేస్తే మొదటి ప్రాధాన్యత ఇచ్చిన వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. మొదటి ఓటు వేసిన అభ్యర్థి పోటీ నుంచి ఎలిమినేట్ అయితే మాత్రమే 2, 3, 4 ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. కాబట్టి మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన వారికి ఏమీ ఇబ్బంది ఉండదు.

అవగాహన కల్పిస్తున్నాం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యత ఓటు ఎలా వేయాలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నాం. ఓటింగ్ సమయంలో ఏమి చేయాలో.. ఏమి చేయకూడదో మండల కార్యాలయాలు, ఆర్‌డీఓ ఆఫీస్, కలెక్టరేట్‌లో పోస్టర్లను అందుబాటులో ఉంచాం. అంతేకాక క్షేత్రస్థాయిలో కూడా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం.

– ఎస్.రామసుందర్‌రెడ్డి, రిటర్నింగ్ అధికారి, కర్నూలు

బ్రీడ్ మల్టిఫికేషన్ ఫామ్‌గా 'గోపవరం డెయిరీ'

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా గోపవరంలోని శివ ఫార్చ్యూన్స్, డెయిరీ ఫామ్‌ను కేంద్ర ప్రభుత్వం బ్రీడ్ మల్టిఫికేషన్ ఫామ్‌గా అభివృద్ధి చేసేందుకు అనుమతించింది. ఈ మేరకు ఇటీవల కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. మహానంది మండలం గోపవరం గ్రామ పరిధిలో ఉన్న శివ ఫార్ట్యూన్స్‌ను కేంద్రం గుర్తించడం విశేషం. దీనిని నంద్యాల శాంతిరామ్ జనరల్ ఆసుపత్రిలో అనెస్థీషియా విభాగం అధిపతిగా పని చేస్తున్న యు.శేషఫణి దాదాపు 10 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. డెయిరీలో 200 దేశవాళీ మేలు జాతి పశువులు ఉండగా.. రోజుకు 350 లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. ఒంగోలు, షాహివాల్ ఆవుల పాలకు మార్కెట్‌లో విశేషమైన డిమాండ్ ఉంటోంది. దేశ వ్యాప్తంగా ఐదింటికి బ్రీడ్ మల్టిఫికేషన్ ఫామ్‌గా అభివృద్ధికి అనుమతి లభించగా, ఇందులో ఒకటి గోపవరం డెయిరీ. యూనిట్ కాస్ట్ రూ.4కోట్లు కాగా.. రూ.2 కోట్లు బ్యాంకుల నుంచి రుణం పొందితే కేంద్ర ప్రభుత్వం రెండు విడతలుగా రూ.2కోట్ల సబ్సిడీ ఇస్తుందని డెయిరీ నిర్వాహకులు డాక్టర్ శేషఫణి తెలిపారు. ఇప్పటికే శేషఫణి బ్యాంకు ఖాతాలకు కేంద్రం రూ.50 లక్షలు విడుదల చేసింది.



గోపవరంలోని శివ ఫార్చ్యూన్స్ డెయిరీ ఫామ్‌లోని దేశవాళీ ఆవులు

అప్పులబాధ తాళలేక..

కోవెలకుంట్ల: సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోమవారం ఎస్‌ఐ ప్రతాప్ అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల కృష్ణుడు (36) ఐదెకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని మిరప సాగు చేశాడు. కుటుంబ ఖర్చులు, పెట్టుబడుల నిమిత్తం ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. వాతావరణ అనుకూలించక దిగుబడులు అంతంత మాత్రం రావడంతో నష్టాలు చవిచూశాడు. తీసుకున్న అప్పు చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి పొలానికి వెళ్లి అక్కడే క్రిమిసంహారక గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం పక్క పొలం రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు.



గొల్ల కృష్ణుడు (ఫైల్)

వర్సిటీలో తరగతులను పరిశీలించిన వీసీ

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ కాలేజీల్లోని తరగతులను వీసీ ఆకెపోగు ఆనందరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తరగతి గదుల్లో కొన్ని సదుపాయాలు లేవని విద్యార్థులు చెప్పడంతో ఓ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీపై వీసీ అగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు విభాగంలో తాగు నీరు లేదని, టాయిలెట్లు సక్రమంగా లేవని విద్యార్థులు చెబుతున్నారని, పని తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. వీసీ వెంట రిజిస్ట్రార్ సుందరానంద పుచ్చా, వివిధ విభాగాధిపతులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ఆకెపోగు ఆనందరావు

గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

డోన్ రూరల్: గొసానిపల్లి గ్రామం సమీపంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మృతదేహం బాగా కుళ్లిపోయి గుర్తు పట్టలేని విధంగా మారింది. గత కొద్ది రోజులుగా గ్రామంలో భిక్షాటన చేసే ఓ వ్యక్తి వారం రోజులుగా కనిపించడం లేదని, మృతి చెందిన వ్యక్తి అతనేమోనని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థి అదృశ్యం

బనగానపల్లె: తమ్మడపల్లె గ్రామానికి చెందిన ఎద్దుల శివరామప్రకాష్ అనే విద్యార్థి ఈనెల 5వ తేదీ నుంచి కనిపించడం లేదని తండ్రి నాగశేషుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బనగానపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న శివరామ ప్రకాష్ ఆరోగ్యం బాగలేదని ఈనెల 1వ తేదీన హాస్టల్ నుంచి ఇంటికి చేరుకున్నాడు. కోలుకున్న తర్వాత హాస్టల్‌కు వెళ్లాలని తండ్రి మందలించడంతో ఆదివారం బనగానపల్లెకు చేరుకున్న విద్యార్థి హాస్టల్‌కు వెళ్లలేదు. బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లేక పోవడంతో తండ్రి నాగశేషుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



శివరామప్రకాష్ (ఫైల్)

సెల్‌ఫోన్ దొంగలు అరెస్ట్

- 23 సెల్‌ఫోన్లు, మోటార్ బైక్ స్వాధీనం

ఎమ్మిగనూరురూరల్: సెల్‌ఫోన్ దొంగలను అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్‌ఐ మస్తాన్‌వలి సోమవారం విలేకరులకు తెలిపారు. గతేడాది ఆగస్టు 8వ తేదీన ఎమ్మిగనూరు పట్టణంలోని గోనెగండ్ల రోడ్డు వాసవి సెల్ షాప్‌లో చోరీ జరిగిందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తుండగా సోమవారం పట్టణంలోని వెంకటాపురం క్రాస్ రోడ్డు దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతూ పెసలదిన్నె గ్రామానికి చెందిన చిన్నపోగుల అరుణ్‌కుమార్, చిన్నపోగుల వరుణ్‌కుమార్, గోనెగండ్ల మండలం అల్వాలకు చెందిన పారేపోగు జయరాజు, సర్వోత్తమ నాయుడు కనిపించారన్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా సెల్ ఫోన్లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. వారిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2.45 లక్షల విలువ చేసే 23 సెల్‌ఫోన్లు , మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఏఎస్‌ఐలు విజయ్‌కుమార్, కిష్టప్ప, హెచ్‌సీ నాగరాజు, మద్దిలేటి, పీసీలు రవి, ఉసేన్‌లను ఎస్‌ఐ అభినందించారు.



సెల్ ఫోన్ దొంగలను అరెస్ట్ చూపుతున్న టౌన్ ఎస్‌ఐ మస్తాన్‌వలి

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

నంద్యాల(రూరల్): నూనెపల్లెకు చెందిన షేక్‌బాషా(34) ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ జలీల్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీలో పేపర్ బాయ్‌గా పని చేస్తున్న షేక్‌బాషా సోమవారం తెల్లవారుజామున రైలు పట్టాలపై బహిర్భూమికి వెళ్లడంతో రైలు ఢీకొని మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రేమ పేరుతో మోసం

- పెళ్లికి నిరాకరణ
- అత్యాచారం కేసు నమోదు

కర్నూలు: ప్రేమ పేరుతో ఓ యువకుడు యువతిని మోసం చేశాడు. పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడు. దీంతో తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్‌కు చెందిన భానుప్రకాష్‌పై కర్నూలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అత్యాచారం కేసు నమోదయ్యింది. కర్నూలు నగరం ఎన్‌ఆర్ పేటలోని (బాలాజీ హాస్పిటల్ దగ్గర) సన్‌రీత్ గ్యాస్ట్రో ఫార్మసీ క్లినిక్‌లో పనిచేసేటప్పుడు షెడ్యూల్డ్ కులానికి చెందిన శ్రీరామ్ నగర్ యువతితో పరిచయం కాస్తా ప్రేమగా మారి శారీరకంగా ఒక్కటయ్యారు. కొంతకాలం తర్వాత భానుప్రకాష్ ప్రభుత్వాసుపత్రికి ఎదురుగా ఉన్న సాయి సంతోష్ మెడికల్ షాప్‌లో సేల్స్‌మెన్‌గా చేరాడు. యువతి అతని ఆచూకీ కనుక్కొని తనను పెళ్లి చేసుకోవాలని కోరగా నిరాకరించడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్యాచారం, ఎస్సీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు మూడవ పట్టణ పోలీసులు తెలిపారు.

దొంగ అరెస్ట్.. చోరీ సొత్తు రికవరీ

కొత్తకోట: బదినేహాల్ గ్రామంలో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈనెల 2వ తేదీన శేఖమ్మ ఇంట్లో చోరీ జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శేఖమ్మ ఇంటి పక్కనే ఉన్న ఎరిగేరి రాందాస్‌ను విచారించగా తానే తానే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అతనిని సోమవారం అరెస్ట్ చేసి చోరీ సొత్తు 2 తులాల బంగారం, 45 తులాల వెండి, రూ.పదివేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. చోరీ కేసును ఛేదించిన కానిస్టేబుళ్లు వీరేష్, మధు, శ్రీరాములను ఎస్‌ఐ అభినందించారు.



దొంగను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: తన భర్త మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని కొలుములపల్లె గ్రామానికి చెందిన దూదేకుల సుమేర పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపిన వివరాల మేరకు.. సుమేరను బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామానికి చెందిన చిన్న స్వామికి ఇచ్చి వివాహం చేశారు. కొంతకాలంగా భర్తతో పాటు ఆడపడుచు భర్త బాదుల్లా కలిసి శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్: పట్టణంలోని బి.పి. శేషారెడ్డి నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులో మూడు నెలల శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కో ఆర్డినేటర్ నాగవిజ్ఞేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్స్, బీటెక్ చదివి 21 నుంచి 28 సంవత్సరాల వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. వివరాలకు సెల్: 79812 38237 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మల్లన్నకు శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రమైన శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవ నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చారణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.



స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

నందికొట్కూరు: పట్టణంలోని వడ్డెపేటలో సోమవారం విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి చెందాడు. స్థానికంగా నివాసముంటున్న మద్దిలేటి, మాధవి దంపతులకు కుమారుడు కుమార్తె ఉన్నారు. స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కుమారుడు మధుమోహన్(14) సోమవారం ఇంటి నిర్మాణంలో భాగంగా మిద్దెపైకెక్కి గోడలకు నీళ్లు పోస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో కింద పడ్డాడు. కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.



మృతి చెందిన బాలుడు మధుమోహన్

వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశెనగ	రూ. 2510	రూ. 7392
పొద్దుతిరుగుడు	రూ. 5065	రూ. 5229
ఆముదం	రూ. 4409	రూ. 6359
వాము	రూ. 5011	రూ. 20811
ఉల్లి	రూ. 440	రూ. 869
ఎండు మిర్చి	రూ. 6699	రూ. 36399
శనగలు	రూ. 3001	రూ. 4640
కందులు	రూ. 2001	రూ. 7959
మొక్కజొన్న	రూ. 1967	రూ. 2057
మినుములు	రూ. 6124	రూ. 6855

హైరిస్క్ గర్భిణులకు 'పెద్ద' రక్ష

- పెద్దాసుపత్రికి వచ్చే కేసుల్లో 20 శాతం ఇవే
- సుఖప్రసవం అయ్యేలా వైద్యం అందిస్తున్న డాక్టర్లు
- క్షేత్రస్థాయిలో ముందుగానే గుర్తించి ఆసుపత్రికి పంపిస్తున్న వైద్యసిబ్బంది

కర్నూలు(హాస్పిటల్):

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన భాగ్యలక్ష్మి గర్భం దాల్చింది. అయితే ఆమెకు గుండెలో సమస్యలు కూడా ఉండటంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు గత నెల 27న రెఫర్ చేశారు. ఆమెకు ఈ నెల 2వ తేదీన ఇక్కడి వైద్యులు సిజేరియన్ ద్వారా సుఖ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.

గోనెగండ్ల మండలం కులుమాల గ్రామానికి చెందిన ముంతాజ్‌కు లంగ్ ఎటాక్ (ఊపిరితిత్తుల్లో ఆరోగ్య సమస్య) వచ్చింది. దీంతో పాటు బీపీ, ఆయాసం పెరగడంతో ప్రసవం కోసం ఎమ్మిగనూరు వైద్యులు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వారం రోజుల క్రితం పంపించారు. ఆమెకు ఐదు రోజుల క్రితం వైద్యులు సుఖ ప్రసవం అయ్యేలా చేశారు. ఊపిరితిత్తుల్లో సమస్య ఉండటంతో ఐసీయూలో ఉంచి కోలుకునేలా చేశారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకుంది.

మాతాశిశు సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. ఇందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలోనూ వైద్య సిబ్బంది గర్భిణుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతున్నారు. హైరిస్క్ ఉన్న గర్భిణులను ప్రసవానికి రెండు వారాల ముందుగానే అన్ని రకాల వసతులు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు. మరోవైపు ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ చేతులెత్తేసిన ప్రసవం కేసులు పెద్దాసుపత్రికి వస్తున్నాయి. ఇలాంటి హైరిస్క్ కేసులు ఎన్ని వచ్చినా వారికి సుఖప్రసవం అయ్యేలా చేస్తున్నారు ఇక్కడి వైద్యులు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 87 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 40 అర్బన్‌హెల్త్ సెంటర్లు, మూడు ఏరియా ఆసుపత్రులు, రెండు బోధనాసుపత్రులు ఉన్నాయి. వీటితో పాటు 200లకు పైగా ప్రైవేటు ఆసుపత్రులు ఏర్పాటయ్యాయి. ఇందులో 40 ఆసుపత్రుల్లో ప్రసవాలు నిర్వహిస్తారు. ఆయా ఆసుపత్రుల్లో ఎక్కడ గర్భిణికి హైరిస్క్ ఉందని తెలిసినా వెంటనే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేస్తారు. కేవలం ఉమ్మడి జిల్లానే గాకుండా ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్ జిల్లా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం హైరిస్క్ గర్భిణులను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకొచ్చి ప్రసవాలు చేయిస్తున్నారు. దీంతో ఆసుపత్రిలోని ప్రసూతి విభాగం నిత్యం గర్భిణులతోనే కిటకిటలాడుతుంటోంది.



కర్నూలు పెద్దాసుపత్రి ప్రసూతి విభాగంలో చికిత్స పొందుతున్న బాలింతలు

ఏటా 10వేల ప్రసవాలకు పైగానే...

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతి రోజూ 30 నుంచి 35 ప్రసవాలు జరుగుతున్నాయి. ఈ మేరకు ప్రతి నెలా సగటున 800.. ఏటా 10వేల వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యధిక శాతం ఇక్కడే ప్రసవాలు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇక్కడ ప్రత్యేకంగా మాతాశిశు సంక్షేమ భవనం ఉండటమే గాక ఇటీవల ప్రత్యేకంగా ఐసీయునూ ఏర్పాటు చేశారు. మెడికల్ సమస్యలుంటే వెంటనే ఏఎంసీలో ఉంచి వైద్యం అందిస్తుంటారు.

హైరిస్క్ అయినా సేఫ్ డెలివరీ

ప్రసూతి విభాగంలో ప్రతిరోజూ వచ్చే 30 దాకా ప్రసవాలు చేస్తున్నారు. ఇందులో 5 నుంచి 7 వరకు హైరిస్క్ ప్రసవాలే ఉంటాయి. ఇతర జిల్లాల్లోని బోధనాసుపత్రుల నుంచి సైతం ఇక్కడికి రెఫరల్‌గా చికిత్స కోసం వస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎక్కడ నుంచి వచ్చినా, ఏ ఆసుపత్రి వైద్యులు రెఫర్ చేసినా వెంటనే హైరిస్క్ గర్భిణిని అడ్మిట్ చేసుకుని ఇక్కడి వైద్యులు చికిత్స చేస్తున్నారు. సురక్షిత ప్రసవం చేసి చేసి పంపించడమే లక్ష్యంగా ఇక్కడి వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు.

హైరిస్క్ అయినా ఇబ్బంది లేదు

ఉమ్మడి జిల్లా నుంచే గాక ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి సైతం కర్నూలు పెద్దాసుపత్రికి ప్రతిరోజూ 10 మంది వరకు హైరిస్క్ గర్భిణులు వస్తుంటారు. తీవ్ర రక్తహీనత, బీపీ పెరగడం, తగ్గడం, ఇతర అనారోగ్య సమస్యలతో వస్తున్నారు. వారికి అవసరమైన అన్ని రకాల వైద్యసేవలు అందేలా చేసి సుఖప్రసవం అయ్యేలా చూస్తున్నాం. ఎంతో హైరిస్క్‌తో వచ్చి గర్భిణి సుఖప్రసవం అయి కోలుకుని ఇంటికి వెళ్తుంటే మాకు కలిగే సంతృప్తి చెప్పలేనిదిగా ఉంటుంది.



–డాక్టర్ ఎస్. వెంకటరమణ, గైనకాలజి హెచ్‌వోడీ, జీజీహెచ్, కర్నూలు

వృద్ధురాలి మృతితో ఆందోళన

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వృద్ధురాలు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. తెలంగాణ రాష్ట్రం వడ్డేపల్లి మండలం బుడమర్సు గ్రామానికి చెందిన సవారమ్మ (64) ఊపిరితిత్తుల సమస్యతో చికిత్స నిమిత్తం సోమవారం కలెక్టరేట్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. అయితే ఆమె కోలుకోలేక మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. వైద్యులు సకాలంలో స్పందించకపోవడంతో ఆమె మృతి చెందిందని ఆరోపిస్తూ ఆందోళన చేశారు.

గృహ హింస కేసు నమోదు

పగిడ్యాల: అదనపు కట్నం కోసం కొద్ది రోజులుగా భర్త, అత్త, ఆడపడుచులు మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు షాజహాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్ సోమవారం తెలిపారు. ముచ్చుమర్రి స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన షాజహాన్ కర్నూలు మండలం జోహరాపురం గ్రామానికి చెందిన షేక్ వలిని 8 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే గత కొద్ది రోజులుగా భర్త షేక్ వలి, అత్త రసూల్‌బీ, ఆడపడుచు ముబారక్ వేధింపులకు గురి చేసి అదనపు కట్నం తేవాలని ఇంటి నుంచి గెంటివేశారని స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.